క్లుప్తంగా

ఘనంగా గురుగుల నిమజ్జనం



గురుగులు నిమజ్జనం చేస్తున్న మహిళలు

బెల్లంపల్లిరూరల్: మండలంలో గురుగుల నిమజ్జనం కార్యక్రమాన్ని నేతకానీ మహిళలు ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య పండుగ ఆఖరి రోజైన గురువారం మండలంలోని మాలగురిజా ల, బట్వాన్‌పల్లి, దుగ్నెపల్లి, చాకేపల్లి, చంద్రవెల్లి, చర్లపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని మహిళలు ఎంతో ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. బంక మట్టితో తయారు చేసిన గౌరమ్మ గురుగులను డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా గ్రామ సమీపంలోని చెరువుల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గురుగులను చెరువుల్లో నిమజ్జనం చేశారు. సంప్రదాయంగా పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కుల దైవాలకు నేవైద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కుక్క కళేబరం తొలగించిన ఎస్సై



కుక్క కళేబరాన్ని తొలగిస్తున్న ఎస్సై

రామకృష్ణాపూర్: పట్టణంలోని సూపర్ బజార్ ప్రధాన కూడలిలో చనిపోయి ఉన్న కుక్కను గురువారం రాత్రి స్థానిక ఎస్సై రాజశేఖర్ స్వయంగా తొలగించారు. శుక్రవారం మంత్రి సీతక్క పర్యటన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటుందనే సమాచారం నేపథ్యంలో, బందోబస్తు పర్యవేక్షిస్తున్న సమయంలో సూపర్‌బజార్ సెంటర్‌లో వాహనదారులకు ఆటంకంగా కుక్క చనిపోయి ఉండటాన్ని గమనించిన ఎస్సై తానే స్వయంగా కుక్క కళేబరాన్ని చేతపట్టుకుని దూరంగా తీసుకెళ్లి పడేశారు. ఎవరికో చెప్పి సమయం వృథా కాకుండా ఎస్సై తీసుకున్న చొరవను స్థానికులు అభినందించారు.

ఉత్తమ రైతు పురస్కార గ్రహీతకు సన్మానం



గోనే శ్యాంసుందర్‌రావును సన్మానిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాతమంచిర్యాల: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఉత్తమ రైతు పురస్కారం అందుకున్న పట్టణానికి చెందిన గోనే శ్యాంసుందర్‌రావును జిల్లా కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో గురువారం ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుమ్ముల శ్రీనివాస్, కామిల్ల జయరావు, జెట్టి శ్రీనివాస్, ఇమ్మానుయేల్, యూసూఫ్, కొండపాక ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

దండేపల్లి: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ కరాటే పోటీల్లో దండేపల్లి మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి వెల్ది అభిరామ్ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించాడు. దీంతో అతడిని పాఠశాల హెచ్‌ఎం నాగవర్మ, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

పోషణ అభియాన్ సంబురాలు



పాల్గొన్న చిన్నారులు, సూపర్‌వైజర్ రజిత

భీమారం: ఐసీడీఎస్ ద్వారా మండల కేంద్రంలోని ఇప్పలబొగుడ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా 'ఇంటింటా పోషణ అభియాన్' నిర్వహించి సంబురాలు జరిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు, ప్రతీ కుటుంబం వారి పిల్లలను అంగన్‌కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత, టీచర్ స్వప్న, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భీమారం: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జన్నారం: ఇందన్‌పల్లిలో స్వయంపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు





మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...



కోటపల్లి: విద్యార్థులకు బోధిస్తున్న చిన్నారి



మంచిర్యాలఅర్బన్: పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని



ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో...



మంచిర్యాలఅర్బన్: పట్టణ పురవీధుల్లో విద్యార్థుల ర్యాలీ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో వచ్చి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేసి అలరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాధాకృష్ణన్ జీవితం ప్రతీ ఒక్క విద్యార్థికి ఆదర్శం కావాలని, నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాఠాలు విద్యార్థుల భవితకు మార్గదర్శకాలు కావాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ గురువుల బోధనపైనే ఉంటుందని చెప్పారు. వేడుకల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో మిమ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అప్పట్లో మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి కులపతిగా వెళ్తున్న సమయంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆయన వెళ్తున్న గుర్రంబండిని లాగుతూ స్టేషన్‌వరకు తీసుకెళ్లిన సంఘటన గుర్తుచేస్తూ.. విద్యార్థుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.



కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...



దండేపల్లి: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



శిశుమందిర్ పాఠశాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



లక్సెట్టిపేట: ముల్కలగూడ ప్రభుత్వ పాఠశాలలో...



రామునిచెరువు వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



కోటపల్లి: రాంపూర్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల పాఠశాలలో...



మంచిర్యాలటౌన్: వనితావాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో....



లయన్స్ క్లబ్ సభ్యులతో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

కమిషనర్ డ్రైవర్‌కు మున్సిపల్ ఉద్యోగంపై ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: మున్సిపల్ కమిషనర్ కారు డ్రైవర్‌గా ఏడాది క్రితం విధుల్లో చేరిన ప్రైవేట్ వ్యక్తి అయిన పులివైల సాయికిరణ్‌కు ఆరు నెలల క్రితం మున్సిపల్ కార్మికుడిగా కార్యాలయంలో పేరు నమోదు చేసి, పీఎఫ్‌లోనూ నమోదు చేసి మున్సిపాలిటీ నుంచి నేరుగా అతడికి వేతనాన్ని చెల్లిస్తున్నారంటూ తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సాయికిరణ్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించి, వేతనం నిలిపివేసి, పీఎఫ్‌లో పేరు తొలగించాలని, రెండు రోజుల్లో తొలగించకుంటే కార్మికులందరం విధులు బహిష్కరించనున్నట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదమల్ల అశోక్‌తేజ, ఆవునూరి గోపాల్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- ఆవుల మెడలో రక్షణ బెల్టుల ఏర్పాటు

నస్పూర్: పట్టణ పరిధిలో పలు కాలనీల్లోని అంతర్గత రోడ్లు, జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో ఆవులు గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆవులు సైతం గాయపడుతున్నాయి. కాగా గమనించిన పలువురు జంతు ప్రేమికులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి, మూడు రోజులుగా రేడియంతో కూడిన బెల్టులపై సేవ్ ఎనిమల్స్–సేఫ్ డ్రైవింగ్ అని వ్రాయించిన ప్రత్యేక బెల్టులను తయారు చేయించి పోలీసుల సహకారంతో ఆవుల మెడలో ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో సాయి ప్రకాశ్, అన్వేశ్ గట్టు, గడ్డం సాయి, తదితరులు పాల్గొన్నారు.



ఆవుల మెడలో బెల్టులు కడుతున్న ఎస్సై, సభ్యులు

ప్రాణహిత వరద ముంపు పరిశీలన

వేమనపల్లి: మండలంలోని ముల్కల్లపేట, రాచర్ల శివారులో ప్రాణహిత ముంపు ప్రాంతాన్ని భీమిని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు రేఖ పరిశీలించారు. నదీ పరీవాహక ప్రాంతం వెంట ముంపునకు గురైన పంటల ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముంపునకు గురై పంట నష్టపోయామని, నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు ఏడీఏ తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి వీరన్న, ఏఈవోలు రుక్సార్ సుల్తానా, హెప్సిబా, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టంపై అధికారుల సర్వే

జన్నారం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల వివరాలను గురువారం ఏవో సంగీత, ఏఈవో త్రిసంధ్య సేకరించారు. పంట పొలాలు, పత్తి చేలకు వెళ్లి పంటను పరిశీలించి నష్టం అంచనా వేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏవో సంగీత తెలిపారు.



ప్రాణహిత వరదను పరిశీలిస్తున్న ఏడీఏ రేఖ

గురువును గుర్తించి.. గులాబీ పూలిచ్చి



మంచిర్యాలఅర్బన్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను గుర్తించి గులాబీ పూలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. బస్‌స్టేషన్ ఆవరణలో బస్సుల్లోకి ఎక్కి, టీచర్లు ఎవరని అడిగి తెలుసుకున్న తర్వాత గులాబీ పూలు అందజేశారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ సర్వీసులోనే ప్రయాణం చేయాలని సూచించారు. డీఎం జనార్దన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు



పార్టీలో చేరిన మండల మాజీ ప్రజాప్రతినిధులు

కాసిపేట: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో భారీగా కాంగ్రెస్‌లో చేరారు. మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రమ్‌రావు, ఓరియంట్ సిమెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, సుమలత, ముత్యంపల్లి మాజీ ఎంపీటీసీ భీమయ్య, బీఆర్‌ఎస్ దేవాపూర్ టౌన్ ప్రెసిడెంట్ వడ్లూరి మల్లేష్, నాయకులు వేణు, శ్యాంసింగ్, సందీప్, రాజేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, మధు, రాజు, కొమ్ము సతీష్, యాదవ సంఘం కులస్తులు లక్ష్మయ్య, వేల్పుల రవి, పోశం, ప్రసాద్‌తో పాటు పలువురు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా కొమురయ్య వర్ధంతి

జైపూర్/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/మందమర్రి రూరల్/శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించిన ఘనత దివంగత ఏఐటీయూసీ నేత మనుబోతుల కొమురయ్యకే దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని పలు సింగరేణి ఏరియాల్లో ఆయన వర్ధంతిని పురస్కరించుకొని కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బొగ్గు గని కార్మికుల జీవితాల్లో వెలుగు నింపిన మహా నాయకుడని, తెలంగాణ సాయుధ పోరాటం నుంచి సింగరేణిలో ఎన్నో కార్మిక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. ఏఐటీయూసీని స్థాపించిన వారిలో ఒకరని ఆ యూనియన్‌కు, కార్మిక వర్గానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జైపూర్‌లో ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, బెల్లంపల్లిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణాపూర్‌లో ఏఐటీయూసీ యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, హరి రామకృష్ణ, వేణుగోపాల్, రామకృష్ణ, నరేంద్ర, శ్రీరాంపూర్‌లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

నిందితున్ని కఠినంగా శిక్షించాలి

దండేపల్లి/లక్సెట్టిపేట/బెల్లంపల్లిరూరల్(తాండూర్)/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జైనూర్ మండలంలో ఓ మహిళ పై ఆటో డ్రైవర్ లైంగిక దాడికి యత్నించడంతో పాటు, హత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివాసీ సంఘాల నాయకులు వ్యాపార దుకాణాలు, హోటళ్లను, గురువారం మూసివేయించారు. మహిళను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లక్సెట్టిపేట అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పట్టపగలే మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో హాజీపూర్ మండలం గఢ్‌పూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు.



దండేపల్లి: మాట్లాడుతున్న నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన

భీమారం: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భీమారం మండలం బూర్గుపల్లిలో గురువారం రాత్రి సైబర్ నేరాలపై కళాకారుల బృందం కళాజాత నిర్వహించారు. ఎస్సై బి రాములు మాట్లాడారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వొద్దని సూచించారు. గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌పై పాటల రూపంలో ప్రదర్శించారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

కోటపల్లి: మండలంలోని శెట్‌పల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కొట్టె మణి అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటూ గురువారం ఉదయం మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెకు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

'ఎస్సీ కాలనీవాసులకు అండగా నిలుస్తాం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో పడ్తనపల్లి ఎస్సీ కాలనీ జలమయంగా మారింది. దీంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా గురువారం ఎస్సీ కాలనీ వాసులతో ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎస్సీ కాలనీని సందర్శించి పునరావాసం కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: సమయపాలన పాటించని టీచర్లపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్యకు బీఎస్‌ఎఫ్ బాధ్యులు యువరాజ్, వరుణ్ వినతిపత్రం అందజేశారు. నిబంధనలు పాటించకుండా కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సమాచారం ఇచ్చామంటూ పాఠశాల సమయంలో వ్యక్తిగత పనులపై బయటతిరుగుతున్నారని దృష్టికి తెచ్చారు.

అత్యాచార దోషులను శిక్షించాలి

పాతమంచిర్యాల: కోలకత్తలో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం, హత్య చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

ఐదో వార్డులో వైద్య ఆరోగ్య శిబిరం

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని ఐదో వార్డులో గురువారం వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రోగులను హెల్త్ సెంటర్ వైద్యులు డి.సౌజన్య, డాక్టర్ జుబేర్ పరీక్షించి అవసరమైన రోగులకు మాత్రలు అందజేశారు. వైద్యం కావాల్సిన రోగులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. వైద్య ఆరోగ్య శిబిరాన్ని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్‌నాయక్ సందర్శించారు. వైద్య శిబిరంలో మొత్తం 77మంది రోగులను పరీక్షించారు.

నోట్‌బుక్స్ పంపిణీ

భీమారం: గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కాజిపల్లిలో ప్రొఫెసర్, ఎమ్మెల్సీ కోదండరాం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు వాటర్ బాటిల్స్ అందజేశారు.